# సిగ్గు

ఏడ్చే మగాడినీ, నవ్వే ఆడదాన్నీ నమ్మకూడదనే పెద్దల మాటను సురేంద్ర మోహన్ నమ్ముతాడు. అతను కూడా పెద్దే. పెద్దల మాటతో ఏకీభవించినందుకే కాకుండా సంఘంలో తనకున్న స్థాయిలో కూడా సురేంద్రమోహన్ పెద్దే.

సురేంద్రమోహన్ బంగారం చెంచాతో కాకపోయినా వెండి చెంచా నోట్లో పెట్టుకునే పుట్టాడు. అతను కాలేజీలో చదివే రోజుల్లో పెట్టి పుట్టాడు గురుడు' అనుకునే వాళ్ళు చాలామంది. అతని బట్టలూ, దర్జా చూసి. చదువయ్యాక తండ్రికి ఆసరాగా వ్యాపారంలో దిగి, దాన్ని విస్తరించినప్పుడు, సురేంద్రమోహన్ పట్టిందల్లా బంగారమే' అన్నారు అనేకమంది.


రాత్రి తొమ్మిది గంటలయ్యింది. సూర్యుడు ఎప్పుడో నిద్రలోకి జారుకున్నా, నేలంతా ఇంకా వేడి వేడి గానే వుంది. ఎండకి ఒళ్లు పేలిపోయిన చెట్లు శవాల్లా బిగుసుకు పోయాయి. సురేంద్రమెహన్ గది మాత్రం చల్లచల్లగా హాయిహాయిగా వుంది. 'జీ' టీవిలో పాత పాటలు మృదు మధురంగా మంద్ర స్వరంలో వస్తున్నాయి.

ఆ పాటల్ని సురేంద్రమోహన్ చూస్తున్నాడుకానీ, వినడం లేదు. ఆలోచిస్తున్నాడు. తన వ్యాపారం లావాదేవీల గురించి ఆలోచిస్తున్నాడు. బొంబాయి నుంచి రావలసిన ఫోన్‌కాల్ కోసం ఎదురు చూస్తున్నాడు. అతని మంచం పక్కన నేలమీద కూర్చున్న బ్లాకీ తన యజమాని ఎప్పుడు డిన్నర్‌కెళ్తాడా, ఎప్పుడు తనకు తిండి పెట్టిస్తాడా అని ఎదురు చూస్తోంది. అయ్యగారు 'ఇంటికెళ్ళిపో' అని ఎప్పుడు చెబుతారా అని గోవిందు ఎదురు చూస్తున్నాడు.

"ఇంటి దగ్గర నూకాలు ఒక్కర్తీ వుంటది. పోయిన బిడ్డను తల్చుకుంటూ ఏడుస్తా వుండుంటది" అనుకున్నాడు గోవిందు.

కొడుకు పోయి పదిహేను రోజులయినా ఆరోజే జరిగినట్టుగా వుంది గోవిందుకు. ఏడేళ్ల కొడుకు అప్పటివరకూ తండ్రి చుట్టూనే తిరిగాడు. "అదేటి నాన్నా ఇదేటి నాన్నా, అదెందుకలా వున్నాది, ఇదెందు కిలా వున్నాది" అని ఎన్నెన్నో ప్రశ్నలేశాడు. తండ్రి కూడా తిరిగి తిరిగి "కాళ్లు పీకుతున్నాయి. ఎత్తుకో మన్నాడు. కాసేపటికి 'ఇంకసాల్లే' అని దిగి బ్లాకీ వెంట పరిగెత్తాడు. బ్లాకీ తోకను పట్టుకోవాలనుకున్నాడు. బ్లాకీ తోక వూపుతూ ఒక్కో మెట్టు ఎక్కి శ్లాబ్ వేస్తున్న మూడో అంతస్తుకెళ్లింది. గోవిందు కొడుకూ వెళ్లాడు. పైన పరుగెడుతూ పట్టు తప్పి కిందకు పడిపోయాడు.

దబ్బున శబ్దం అయ్యేటప్పటికి అటు చూశాడు గోవిందు, ఒక్క క్షణం ఏవిటో బోధపడలేదు.



గబుక్కున నాలుగడుగులేశాడు. గుండె ఝల్లుమంది. వెనుకకే వెసి పడిపోయాడు. గుండె చెరువయ్యేలా ఏడ్చాడు. శ్లాబ్ పని చేస్తున్న వాళ్ళు గబగబా కిందకొచ్చారు.

"ఒరి దేవుడా, ఎంత పని సేసేవురా" అని గోవిందు ఏడ్చాడు.

"నీకు నానేం అన్నేయం సేసేను" అని ఏడ్చాడు.

"అన్నెం పున్నెం తెలీని, ముక్కు పచ్చలారని నా బాబేం తప్పుసేసేడని ఇంత అగాయిత్యం సేసేవు" అని ఏడ్చాడు.

అంతా కలిసి గోవిందునూ, రక్తపు ముద్దయిన అతనికొడుకునూ అక్కడికి దగ్గర్లోనే వున్న అతనింటికి తీసుకెళ్లారు.

నూకాలు దూరం నుంచి అంత మందిని చూసి ఏదో జరిగిందని భయపడింది. వాళ్లు దగ్గరకు వచ్చాక, రక్తపు ముద్దను చూసి,

"నాయనా, నాసిట్టితండ్రీ" అంటూ స్పృహ తప్పి పడిపోయింది.

చుట్టుపక్కల వాళ్లు వచ్చారు.

"అయ్యో, అయ్యయ్యో" అన్నారు. నూకాలకు ఉప చర్యలు చేశారు. కాసేపటికి నూకాలు లేచింది.

"నాసిట్టి తండ్రికప్పుడే నూరేళ్లు నిండిపోనాయా" అంది గొణుక్కుంటున్నట్టుగా, నమ్మలేనట్టుగా, తన రక్తపు ముద్దను గుండెల కద్దుకుంది.

"ఇందాకే కదరా నాసేతి వన్నంతిని, నేనొద్దంటున్నా యినకుండా నాన్నెంట యేళ్లావు. బగవంతుడా, ఎంత పాపాని కొడిగట్టినావు. రోజా పొద్దున్నే నీకు దండవెడతానే, పెతిసెనోరం వుపవాసముంటానే, నా పూజలందుకని ఆనక కడుపుకోత యెట్టినావు కదరా. నా బిడ్డన్నాకిచ్చెయ్. నా బిడ్డన్నాకిచ్చెయ్. దేవుడా, సీవాచలం అప్పన్నా, తిరపతి ఎంకన్నా నాబిడ్డన్నాకిచ్చెయండి" అంటూ భోరుభోరున ఏడ్చింది నూకాలు.

"వూరుకో సెల్లీ"

"వూరుకో వూరుకో ఒలప్పా"

అంటూ పక్కిళ్ల ఆడవాళ్లు ఓదారుస్తుంటే నూకాలు దుఃఖం మరింత పెరిగింది. రక్తం ముద్ద పైకి వొంగివొంగి వెక్కి వెక్కి ఏడ్చింది. పైట వూడిందని ఆమెకు తెలీదు, ఎవరో ఒకరిద్దరు మగాళ్ళకు తప్ప ఒంటిపైనున్న జాకెట్టు చిరుగులదనీ గుర్తులేదు.

ఏడ్చిఏడ్చి నూకాలు మళ్లీ స్పృహ తప్పిపోయింది.

గోవిందు తోటి వాళ్ల సాయంతో తన రక్తపు ముద్దను ఖననం చేశాడు.

సూర్యుడు తన ప్రతాపం చాలించి, సిగ్గు పడుతూ పడమటి కొండల్లో తలదాచుకున్నాడు. ఆకాశం తెల్లముఖం వేసుకుంది. చెట్లు దిగ్భ్రాంతితో నిలబడిపోయాయి.

రెండు రోజులపాటు గోవిందు పనిలో కెళ్లకుండా ఇంట్లోనే వుండిపోయాడు. తనేడుస్తూ, ఏడుస్తున్న

భార్యను ఓదారుస్తూ ఇంట్లోనే వుండిపోయాడు. కొడుకు చేసే అల్లరి, ముద్దు ముద్దు మాటలు, పేచీలు, బెదిరింపులు...గుర్తుకొస్తుంటే ఏడుపు తన్నుకొచ్చేది.

మూడో రోజున గోవిందు పనిలో కెళ్లాడు. సురేంద్రమోహన్ కూడా అరోజే కేంప్ నుంచి వచ్చాడు. జరిగిన ఘోరం చెబుతూ గోవిందు ఘోల్లున ఏడ్చాడు.

"ఛ ఛ, ఛీఛీ, ఏవిటా ఏడుపు" అని సురేంద్రమోహన్ మొదట చీదరించు కున్నాడు.

"ఇదిగో ఈ డబ్బు వుంచు" అంటూ అయిదొందలు గోవిందు చేతికిచ్చాడు.

గోవిందుకు మరింత దుఃఖం వచ్చింది.

"ముందా ఏడుపు ఆపు. మగాడివి ఇలా ఏడవడానికి సిగ్గెయ్యడం లేదూ, ఇంకాపు. ఇలాంటివి ఒకోసారి జరుగుతుంటాయి. గుండె నిబ్బరం చేసుకోవాలి. మీరిద్దరూ వయసులోనే వున్నారు. మళ్లీ ఇంకో బిడ్డ పుడతాడు. వెళ్లు, వెళ్లి పనిచేసుకో" అని సురేంద్రమోహన్ తన ఎ.సి. రూమ్‌లో కెళ్లిపోయాడు.

గోవిందు ఒక్క క్షణం అలానే నిలబడి, కళ్లు తుడుచుకుని పనిలో పడ్డాడు. కొడుకు జ్ఞాపకాలు వెంటాడుతూనే వున్నాయి.

మానసిక శ్రమలో బాధలు కాసేపు మరచి పోవచ్చునేమో కానీ, శారీరక శ్రమలో వాటిని మరిచిపోవడం కష్టం.

అతని మనసులాగే అంతటా చీకటి ఆవరించింది. కష్టాల్లా చీకటి, కన్నీళ్లలా చీకటి, పీడకలల్లా చీకటి, వెంటాడే జ్ఞాపకాల్లా చీకటి.

తువాలుతో చెమట తుడుచుకుని గోవిందు ఇంటికెళ్లాడు. నూకాలు కట్టెల పొయ్యి ముందు కూర్చుని గొట్టంతో ఊదుతోంది. ఆమె మనసూ ఉడికిపోతోంది.

కొడుకు తన వీపు మీదకు వాలి రెండు చేతులతో తనను కౌగలించుకున్నట్టనిపించి 'ఉండరాసిట్టీ' అని వాడి చేతుల్ని వెనక్కు తీసెయ్యబోయింది. అక్కడే చేతులూ లేక పోవడంతో ఆమెకు కన్నీళ్లొచ్చాయి.

గోవిందు స్నానం చేసి, వంట గదిలో కొచ్చి.

"ఇంకా వంట కాలేదటే" అన్నాడు.

"అవుతున్నాది"అంది నూకాలు

ఆమె గద్గద స్వరం వినగానే గోవిందు కంట అతని కొడుకు కన్నీరయ్యాడు. ఇందాక యజమాని చెప్పింది గుర్తొస్తూంది.

పొయ్యిమీది కుండను పట్టుకుని వాల్చి, గంజి వార్చి, నూకాలు ముక్కు చీదుకుంటూ భర్త వేపు తిరిగింది.

యజమాని అన్న మాటలన్నీ గోవిందు భార్యకు చెప్పాడు. నూకాలు వినీ వినీ,

"నా దగ్గరింకెప్పుడూ నీ అయ్యగారి కబుర్లు సెప్పకు. పెళ్లాం సచ్చిపోయినప్పుడు కంట వో సుక్క కూడా కన్నీరెట్టనోడు నీ యజమాని. అలాంటి రాతి గుండోడి మాటలు నాకు సెప్పకు" అంది

కోపంగా నూకాలు.

గోవిందు ఇంకేమీ అనలేకపోయాడు. మూడేళ్ళక్రితం సురేంద్రమోహన్ భార్య ఏదో జబ్బుతో చనిపోయింది. అతను ఆ రోజున కానీ, ఆ తర్వాత కానీ కన్నీళ్ళు పెట్టుకోలేదు. హిందీ సినిమాల్లోని టున్‌టున్‌లా, తెలుగు సినిమాల్లోని కల్పనారాయ్‌లా వుండే భార్యపోగానే అతను ఏడవలేదు. ఆమెకు నవ్వెక్కువ. హాస్య చతురత కూడా ఎక్కువే. నలుగురితోనూ కలివిడిగా వుండేది. ఆమె లావెక్కక ముందు బొద్దుగా పిటపిట లాడుతూ వున్న రోజుల్లో ఏదో ఒకనాడు తన కన్ను కప్పి వుండేవుంటుందని సురేంద్రమోహన్‌కు నమ్మకం, లేదా అనుమానం. ఆమె పోయిన మూణ్నెల్లకే నాజూకైన ఓ అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు.

"తప్పేం వుంది. ఏభై యేళ్ళు కూడా ఇంకా నిండలేదు మనోడికి. మగాడు తోడు లేకుండా ఎలా బతగ్గలడు. అందమైన అమ్మాయినే చేసుకున్నాడు. మనోడెప్పుడూ లక్కీ ఫెలోయే" అని అన్నారు అతని బంధువుల్లోని మగాళ్ళు.

"పెళ్ళాం పోయినా కొంచెం కూడా బాధ పడలేదు. పెళ్లాం పోయిన మూణ్నెల్లకే మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్య అందంగా లేకపోయినా ఎంతో మంచిది. ఆయనకే కష్టం రాకుండా చూసుకునేది. ఆయన కేంప్‌కెళ్లి వస్తానన్న రోజున రాకపోతే ఎంత కంగారు పడేదో, ఆయనకోసారి టైఫాయిడ్ వస్తే ఆవిడ రాత్రీ పగలూ దగ్గరే వుండి ఎంతో సేవ చేసింది. ఆవిడ ప్రేమాభిమానాలన్నీ మరిచిపోయాడు. మగాళ్లంత విశ్వాస ఘాతకులు ఇంకెవరూ వుండరు" అనుకున్నారు అతని బంధువర్గంలోని ఆడవాళ్లు.

ఎవరేమనుకున్నా సురేంద్రమోహన్ పట్టించుకోలేదు. రెండో భార్యతో వీలయినంత సుఖం పొందే ప్రయత్నాల్లో పడిపోయాడు. జరిగినదంతా మంచికేనని, అనుకోవడమే తన పని అనుకున్నాడు.

సురేంద్రమోహన్ బంధువర్గంలోని ఆడవాళ్లలాగే నూకాలూ అనుకుంది. భర్త గొప్పగా చెప్పబోయిన అయ్యగారి కబుర్లను యీసడించుకుంది.

"సాల్లేవయ్యా పెద్ద సెప్పొచ్చావ్. నీ యజమాని గొప్పలు ఆడి దగ్గరే వుండనియ్యి. ఇంటికి తేబోక" అంది.

అదే మాట ఇప్పుడూ అంది నూకాలు.

గుడ్డి వెన్నెల పాలిపోయిన మనిషిలా వుంది. సురేంద్రమోహన్ మేడకు కనుచూపు దూరంలో ప్రవహిస్తున్న గోదావరి జాలితెలీని చుక్కల పులిలా వుంది. నిటారుగా నిలుచున్న చెట్లు ఆగుడ్డి వెన్నెల్లో రాకాసి గుడ్ల గూబల్లావున్నాయి. తెల్లమేడ రాముడి దగ్గరకు హొయలొలికిస్తూ వచ్చిన శూర్పణకలా వుంది.

"అయ్యగారింకా పిలవలేదేంటి? నూకాలు ఒకర్తే ఏడుస్తాకూసునుంటది" అనుకున్నాడు గోవిందు ఎ.సి.రూమ్‌కు దగ్గర్లో నిలబడి.

సురేంద్రమోహన్ చల్లచల్లని గదిలో కాలుకాలిన పిల్లిలా మెల్లమెల్లగా పచార్లు చేస్తున్నాడు. బొంబాయి నుంచి ఫోన్‌కాల్ ఇంకా రాలేదు.

"ఈ ఫోన్ మీదే నా భవిష్యత్తంతా ఆధారపడి వుంది. ఒక్కసారే అంత సరకు పంపాల్సింది కాదేమో" అనుకుంటూ మధ్య మధ్యలో ఫోన్ వంక చూస్తున్నాడు.

ఆకలితో కడుపు నకనకలాడుతున్న బ్లాకీ అసహనంగా యజమాని వంక చూస్తోంది.

గోడ గడియారంలోంచి అర్ధనగ్న సుందరి బయటికొచ్చి, కన్నుగీటి, లపీమని పదిగంటలు కొట్టి మళ్లీ లోపలికెళ్లి పోయింది.

ఇక టెన్షన్ భరించలేక 'ముందు పని తర్వాత మందు' అనే నియమాన్ని వదిలేసి ఫారిన్ విస్కీ బాటిల్ ఓపెన్ చేశాడు సురేంద్రమోహన్. గ్లాసులో విస్కీ పోసి సోడాతో నింపి, సిప్ చేశాడు.

"మన కొంప మునిగింది. మన భోజనం ఇంక తెల్లారగట్లే" అనుకుంది బ్లాకీ యజమాని చేతిలోని విస్కీ గ్లాసు వంక విసుగ్గా చూస్తూ.

ఇక లాభం లేదనుకుని "భౌయ్‌భౌయ్" మంది, చొంగ కారుస్తూ నాలిక ముందుకు చాపి పైకీ కిందకీ వూపింది బ్లాకీ.

సురేంద్రమెహన్ ఆలోచన్ల నుంచి బయటపడి బ్లాకీ వంక చూశాడు.

"పాపం బ్లాకీ ఇంకా తిండితినలేదు" అని గుర్తుకొచ్చింది.

కాలింగ్‌బెల్ నొక్కాడు. గోవిందు గబగబా గదిలోకొచ్చాడు.

"బ్లాకీకి అన్నం పెట్టించు. అమ్మగారింకా క్లబ్బు నుంచి రాలేదా"

"నేదండి"

"సర్లే, దీన్ని తీసుకెళ్లు" అన్నాడు సురేంద్రమోహన్

గోవిందు బ్లాకీని తీసుకెళ్లాడు.

అంతలో ఫోన్ రింగయింది. సురేంద్రమెహన్ విస్కీగ్లాసు టీ పాయ్ మీద పెట్టి, గబుక్కున ఫోన్ అందున్నాడు.

"ఎస్, సురేంద్ర స్పీకింగ్" అన్నాడు.

అటువైపు నుంచి మాటలు వింటూ,

"ఏంటీ, ఏంటేంటీ, ఆ" అంటూ మంచం మీద కూలబడిపోయాడు. మంచం పక్కనే వున్న బజర్ మీద అతని చెయ్యిపడింది. ఫోన్ రిసీవర్ నేలమీద పడిపోయింది.

గోవిందు పరుగెత్తుకు వచ్చాడు.

కాళ్లు రెండూ బారచాపి, తల గోడకు ఆన్చి శవంలా వున్న సురేంద్రమోహన్‌ను చూసి,

"అయ్యగోరూ" అని అరిచాడు గోవిందు.

సురేంద్రమోహన్ నెమ్మదిగా కళ్లెత్తి గోవిందును చూశాడు.

గోవిందు ఆశ్చర్యపోయాడు.

సురేంద్రమోహన్ కళ్లల్లో నీళ్లు!

"ఏమయ్యిందయ్యగోరూ" ఆత్రంగా అడిగాడు గోవిందు.

సురేంద్రమోహన్ చెయ్యెత్తి అటూ ఇటూ వూపాడు.

గోవిందుకు అర్థంకాలేదు. మళ్లీ అడిగాడు.

"అంతా అయిపోయిందిరా. లక్షా రెండు లక్షలూ కాదు, మొత్తం మునిగి పోయానురా" అంటూ సురేంద్రమెహన్ కన్నీళ్లు తడుచుకున్నాడు.

"ఊరుకోండయ్యగోరూ" అన్నాడు గోవిందు.

ఆ మాటతో సురేంద్రమెహన్‌కు ఏడుపొచ్చేసింది.

ఏమనడానికీ తోచక గోవిందు తెల్లబోతూ నిలుచుండిపోయాడు.

సురేంద్రమోహన్ ఏడుస్తూనే విస్కీ బాటిల్ చేతిలోకి తీసుకున్నాడు.

గోవిందు నెమ్మదిగా తలుపు వేసి, బయటి కొచ్చి, మేడ మెట్టు మీద కూర్చుని కళ్లు మూసుకున్నాడు.

"ఏటయ్యా, ఇంత రేతిరయినా ఇక్కడే వుండిపోనావు" అంటూ నూకాలు వచ్చింది.

ఉలిక్కిపడి తలెత్తి చూశాడు గోవిందు. నెమ్మదిగా జరిగినదంతా చెప్పాడు.

తన కొడుకు పోయినప్పుడు 'అయ్య గోరు' అన్న మాటలు ఆమెకు గుర్తొచ్చి ఏదో అనబోయి, ఆవేశాన్ని అపుకుంది.

గుడ్డి వెన్నెల్లోకోసారి చూసి,

"గొప్పవాళ్ల యవ్వారం బలే సిత్రంగా వుంటాదయ్యా"అంది నూకాలు కసిగా.

*(ఆహ్వానం మాసపత్రిక, జనవరి 1995)*